
# నవతరం కోసం నవతరం రాసిన నవ్య కథ



తన ఎదురుగా వున్న ఛెయిర్లో ఆందోళన నిండిన మొఖంతో కూర్చుని వున్న ఆనంద్‌ను పరిశీలనగా చూశాడు డాక్టర్ రాందాస్. ముప్పైఐదేళ్ల ఆనంద్ మొఖంలో టెన్షన్ గూడు కట్టుకొని వుంది. ఏదో ఆలోచనలో వున్నట్లు పరధ్యానంగా వున్నాడతను.

డాక్టర్ రాందాస్ చిన్నగా గొంతు సవరించుకొని చెప్పాడు ''మిస్టర్ ఆనంద్, మీరు ఇంతగా వర్రీ కావలసిన అవసరం లేదు, మెడికల్ టెక్నాలజీ ఇప్పుడు బాగా ఇంప్రూవ్ అయ్యింది కదా, వారం రోజుల్లో మీకు జరిగే ఆపరేషన్ గురించి మరింతగా కలత చెందవలసిన అవసరం లేదు'' ఇంకా చెప్పబోతున్న రాందాస్ తన గొంతుకేదో అడ్డం పడినట్లు ఠక్కున ఆగిపోయాడు. తాను చెప్తున్నది పూర్తిగా నిజం కాదని తనకే తెలుసు.

# నిర్ణయం

రాచపూటి రమేష్


''అది కాదు డాక్టర్, నాకేదో జరుగుతుందన్న భయం నాకు లేదు. నామీద ఆధారపడి మొత్తం మరో నలుగురున్నారు మా ఇంట్లో... పై పెచ్చు నాకూ, నాన్నగారికీ ఒకేసారి ఆపరేషన్ జరగబోతోంది కదా.''

రాందాసు ముందున్న టేబిల్‌పై ఎర్ర రంగు లైటు వెలిగింది. పేషెంటు తన కన్సల్టింగ్ రూంలోకి వచ్చి పది నిమిషాలయ్యిందనే దానికి సూచన అది. సాధారణంగా రాందాసు తన పేషెంట్లను ఆ గడువులోనే పరీక్ష చేసి పంపుతూ వుంటాడు.

కానీ ప్రస్తుతం తన ముందున్న ఆనంద్‌కు చెయ్యవలసిన పరీక్షలన్నీ ఎప్పుడో చేసేశాడు రాందాసు. సాధారణంగా ఆపరేషన్‌కు ముందు తన పేషెంట్స్‌కు ఒకటి, రెండు సెషన్స్‌లలో కౌన్సిలింగ్ ఇస్తూ వుంటాడు రాందాసు. ఇప్పుడు ఆనంద్‌ను ఆ కారణంగానే క్లినిక్కు రమ్మన్నాడు రాందాసు.

వారం రోజుల్లో ఆనంద్ తండ్రి రాఘవరావుగారికి 'లివర్ ట్రాన్స్‌ప్లేంటేషన్ చేయవలసివుంది. సాధారణంగా పేషెంటు దగ్గర బంధువుల్లో ఎవరో ఒకరి లివర్‌లోంచి కొంత భాగాన్ని తీసి పేషెంటుకు అమరుస్తూవుంటారు. రాఘవరావు గారి వయస్సు అరవైరెండు. ఆయన భార్య ఎప్పుడో పోయింది. సోదరులకు ఆయనకంటే ఎక్కువ వయసు వుంది. రాఘవరావు గారి కొడుకు ఆనంద్‌ను పరీక్షించి లివర్ డొనేషన్‌కు అర్హుడుగా నిర్ణయించాడు రాందాసు.

ఓ చిన్న ప్రయివేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు ఆనంద్. రోజూ తొమ్మిదిగంటల పాటు ఆఫీసు పని... పోనూ, రానూ మరో రెండు గంటలు సిటీ బస్సుల్లో ప్రయాణం. భార్య సునందుకు ఇద్దరు పిల్లలతోనే పని సరిపోతూ వుంటుంది. ఆర్టీసీలో ఆఫీసరుగా పని చేసి రిటైరైన రాఘవరావుగారే ఆ ఇంటికి పెద్ద దిక్కు.



ఏడాది క్రితం ఆనంద్‌కు ఛాతీలో స్వల్పంగా నొప్పి రావడంతో కార్డియాలజిస్టు దగ్గరకు వెళ్లాడు. డాక్టర్ పరీక్షించి, ఆనంద్‌కు హార్ట్ ప్రాబ్లమ్ వుందని తేల్చాడు. క్రమం తప్పకుండా మందులు వాడితే, జబ్బు కంట్రోల్లో వుంచుకోవచ్చని చెప్పాడు. చిరుద్యోగైన ఆనంద్‌కు ఆ వార్త అశనిపాతమయ్యింది.

ప్రస్తుతం రాఘవరావు గారికి కాలేయన్నందించే దాతగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆనంద్‌ను ఎంపిక చేశారు డాక్టర్ రాందాసు. గుండె జబ్బు మనిషైనా, యువకుడే కాబట్టి, ఆపరేషన్ తరవాత అంత కాంప్లికేషన్స్ వుండకపోవచ్చు. కానీ మానవ శరీర నిర్మాణం చిత్రమైనది. ఒక అంగానికి నష్టం వాటిల్లితే, దాని ప్రభావం మిగతా అవయవాలపై కూడా తప్పని సరిగా వుంటుంది. ఆపరేషన్ తరువాత ఆనంద్‌కు మామూలు జీవితం గడిపే అవకాశాలు ఎంతున్నాయో, కాలక్రమంలో మరిన్ని ప్రతికూల పరిస్థితులు నెలకొనే అవకాశాలు కూడా అన్నే వున్నాయని రాందాసుకు బాగా తెలుసు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తాను చేయగలిగిందేమీలేదు.

'కేడవర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటే చనిపోయిన వ్యక్తి నుండి కాలేయం తీసి అమర్చడం ప్రస్తుతం రాఘవరావు ఆరోగ్య దృష్ట్యా వీలు కాదు. కాబట్టే, ఆనంద్‌కూ, రాఘవరావుకూ అన్ని పరీక్షలూ నిర్వహించి ఆపరేషన్‌కు తేదీ నిర్ణయించాడు రాందాసు. ఆ తేది దగ్గర పడుతున్న కొద్దీ ఆనంద్‌లోనూ, అతని కుటుంబ సభ్యులలోనూ ఆందోళన పెరగసాగింది.

రాందాసు ఆందోళనను గమనించినట్లు ఆనంద్ కుర్చీలోంచి లేచి డాక్టరు వద్ద శలవు తీసుకుంటూ చెప్పాడు.

''ఫరవాలేదు డాక్టర్. సర్జన్‌గా మీకెంత పేరుందో మాకంతా బాగా తెలుసు. చాలా తక్కువ ఫీజుకే మీరీ ఆపరేషన్ చేయడానికి ఒప్పుకోవడం మా అదృష్టం. మీ సంరక్షణలో నేనూ, నాన్నగారూ భద్రంగా ఉంటామన్న నమ్మకం నాకుంది. మీరిచ్చిన సూచనలు పాటిస్తాను పద్నాల్గవ తేదీ ఉదయాన్నే మిమ్మల్ని కలుస్తాము''.

ఆనంద్ మొఖంలో చిరునవ్వు డాక్టర్ రాందాసుకు తృప్తినిచ్చింది. 'ఈ ఆపరేషన్ సక్రమంగా జరిగిపోతే పెద్ద భారం దిగిపోయినట్లువుతుంది తనకు కూడా' అనుకున్నాడు.

***

కన్సల్టింగ్ రూంలో తన ముందు కూర్చున్న స్త్రీని తానిదివరకు ఎక్కడ చూశానా' అని గుర్తుకు తెచ్చుకొనేందుకు ప్రయత్నించసాగాడు రాందాసు. కాసేపటికి తని ప్రయత్నం ఫలించింది.' ఆనంద్‌కు తాను టెస్టులు చేసే సమయంలో అతని పక్కన వున్న అతని భార్య 'సునంద'గా ఆమెను గుర్తుపట్టాడు.

'చెప్పమ్మా, ఏమిటిలా వచ్చావు? ఏదో కంగారులో వున్నట్లున్నావు' బేలగా కనిపిస్తున్న ఆమె వంక చూసి అడిగాడు.

సునంద కంఠం వణికింది.

'డాక్టర్, మరి ఆరు రోజుల్లో మా వారికి, మా మామగారికీ ఆపరేషన్ జరగబోతోందిగా , నాకెందుకో భయంగా వుంది' అందామె కన్నీరు నాపుకునే ప్రయత్నం చేస్తూ.

'ఔనమ్మా, కానీ ఇందులో కంగారు పడవాల్సిందేమీ లేదు, ఒకప్పుడుండేదే గానీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్లిప్పుడు - సర్వసాధారమైపోయాయి' అనునయంగా చెప్పాడు రాందాసు.

'కానీ మావారు గుండెజబ్బు మనిషి కదా, ఆపరేషన్ తరువాత ఆయనకేమైనా ఐతే; నేనూ, ఇద్దరు పసివాళ్లూ ఏమైపోవాలి?' భయంగా అడిగిందామె డాక్టరును.

రాందాసు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

గొడ మీద తగిలించి వున్న జీసస్ బొమ్మ వైపు క్షణ కాలం చూసి కొనసాగించిందామె.

'డాక్టర్, మా మామగారు వృద్ధులు. పండుటాకు లాంటి వారు. కానీ మావారు ఇంకా చిన్న వయసులో వున్నారు. ఇద్దరు పిల్లల భవిష్యత్తు తీర్చి దిద్దాల్సిన వారు. ఈ స్టేజిలో ఆయనకేదైనా ఐతే, మేము బతికేదెలా? ఆ పిల్లల భవిష్యత్తు ఏమవ్వాలి? కావలిస్తే నా లివర్ మా మామగారికి ధారబోస్తాను' అందామె రోదిస్తూ.

'అది సాధ్యం కాదమ్మా. రక్తసంబంధీకులే అవయవ దానం చేయాలి ఇటువంటి కేసుల్లో. నీకావిషయం ఇదివరకే చెప్పాను' అన్నాడు రాందాసు.

'డాక్టర్. సావిత్రి భర్తప్రాణాలకోసం యమలోకానికే వెళ్లింది. నేనూ భారతీయ స్త్రీనే. సావిత్రి అంతటి దాన్ని కాకపోయినా, నా మంగళ సూత్రం నాకూ ముఖ్యమే. కోర్టుకు వెళ్లి ఈ ఆపరేషన్ను నిలువరించమని కొందరు నాకు సలహా ఇచ్చారు. కానీ సగటు ఆడదానిగా నేనా పని చేయలేను. కాబట్టి మీకు నా విన్నపమొకటే' అంది సునంద దృఢంగా.

రాందాసు సాలోచనగా చూశాడు.

ఆమె తన హేండ్ బ్యాగ్‌లోంచి కాగితం చుట్టి వున్న ఒక పాకెట్‌ను తీసి టేబుల్‌పై పెట్టింది. రాందాసు నివ్వెరపోయాడు.

'డాక్టర్, ధైర్యం చేసి అడుగుతున్నాను. ఆపరేషన్ రోజున ఏమీ చేయకండి. నా భర్తపై ఆపరేషన్ చేసినట్లు నటించండి. అలాగే మా మామగారికి కూడా, తరువాత ఆ శస్త్ర చికిత్స విఫలమయ్యిందని చెప్పేయండి. మిమ్మల్ని ఎవ్వరూ ఏమీ అడగరు. ఈ పేకెట్‌లో పదిగ్రాముల బంగారు ఛెయిన్, రెండు బంగారు గాజులూ వున్నాయి. మీరు నాకు చేసిన ఉపకారానికి బదులుగా స్వీకరించండి' భయపడుతూ తన ప్రతిపాదనను డాక్టరు ముందు వుంచింది. ఏడ్చి ఏడ్చి ఆమె కళ్లు ఎర్రబడ్డాయి.

రాందాసు టేబుల్‌పై వున్న ఎర్రబల్బు వెలిగింది. సునంద అమాయకత్వానికి నవ్వుకున్నాడు రాందాసు, న్యూస్ పేపర్ చుట్టివున్న పొట్లాన్ని ఆమెకే అందించాడు.

'నువ్వింత భయపడవలసిన పనిలేదమ్మా. నేనున్నాను, అంతా సజావుగా జరుగుతుంది' అంటూ బెల్ నొక్కాడు. టేబుల్‌పై పచ్చలైటు వెలిగింది.

సునంద లేచి నిలబడి కన్నీళ్లు తుడుచుకొంది. పేకెట్‌ను తీసి హేండ్ బ్యాగ్‌లో పెట్టుకొంది. డాక్టరుకు నమస్కరించి చకచకా క్లినిక్ బయటకు నడిచింది.

***

గోడ గడియారంలో టైం చూసుకున్నాడు డాక్టర్ రాందాస్. ఐదు ముప్పావు సూచిస్తోంది. సాయంత్రం ఏడింటికి రాందాస్ తన స్నేహితుని కుమార్తె వివాహానికి హాజరవ్వాలి. మరో పావుగంట తరువాత ఇంటికి బయలుదేరవచ్చుననుకున్నాడు.

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకొని తన ముందుకొస్తున్న పేషెంటును చూసి ఉలిక్కిపడ్డాడు రాందాస్, 'రాఘవరావుగారికిది వరకే టెస్టులన్నీ పూర్తి చేశానే, కౌన్సిలింగ్ రెండు సెషన్లూ పూర్తయ్యింది. మరిప్పుడెందుకొచ్చాడబ్బా?' అనుకున్నాడు.

రాఘవరావు డాక్టరు గారికి నమస్కరించి కుర్చీలో కూర్చున్నాడు. రాందాసు రావుగారివంక చిరునవ్వుతో చూస్తూ ''నేను చెప్పిన సూచనలు తూ.చ. తప్పకుండా పాటిస్తూ వున్నట్లున్నారు. మొఖం తేటగా కనిపిస్తోంది'' అన్నాడు.

రావుగారు నవ్వి, ''ఔను సార్, లిక్విడ్స్ బాగా తక్కువగా తీసుకుంటున్నాను. ప్రొటీన్స్ తక్కువగా వున్న డైట్ కూడా'' అన్నాడు.

''ఆపరేషన్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మీరేం వర్రీ కావలసిన అవసరం లేదు'' వాచ్ చూసుకుంటూ చెప్పాడు డాక్టర్ రాందాస్.

రాఘవరావు డాక్టరుగారి వంక బేలగా చూశాడు. కాసేపు సందేహించి, తటపటాయిస్తూ చెప్పాడు.

''డాక్టర్. మీ శక్తి సామర్థ్యాల మీద నాకు నమ్మకం వుంది. కానీ నన్నేదో తీవ్రమైన శంక పీడిస్తూ వుంది. ఈ వయసులో నాకీ ఆపరేషన్ అవసరమా? ఒకవేళ అది సక్సెస్ ఐనా ఇంకా నేనెవరి కోసం బతకాలి? నేను మరణిస్తే, ఎవరికీ పెద్ద నష్టం లేదు. కానీ నా కొడుకు ఆనంద్ విషయం అలా కాదు. అతని మీద ఆధారపడి మరో ముగ్గురున్నారు. అసలే గుండె జబ్బు మనిషి. రేపు వాడికేమైనా ఐతే...'' గొంతుకేదో అడ్డం పడినట్లు ఆగిపోయాడు రాఘవరావు. ఆయన మొఖంలో టెన్షన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రాందాసు క్షణకాలం ఆగి చెప్పాడు.

''రావుగారూ, నేనిదివరకే చెప్పాను. నా మీద నమ్మకముంచండి, ఐ విల్ ట్రై మై లెవల్ బెస్ట్ టు సేవ్ బోత్ ఆఫ్ యూ''.

రాఘవరావు ఈసారి గొంతులోకి స్థిరత్వం తెచ్చుకొని చెప్పాడు. ''లేదు సార్, ఈ విషయం గురించి బాగా ఆలోచించి నేనో నిర్ణయానికి వచ్చాను. రాలిపోయే పువ్వును నేను, నాకోసం మరో నలుగురి జీవితాలను పణంగా పెట్టడంలో అర్థం లేదు. కానీ ఈ ఆపరేషన్ కేన్సిల్ చేయడానికి మావాడు ఒప్పుకోడు. కాబట్టి మీరు తప్పని సరిగా ఈ సర్జరీ చేయాలి. కాదు, చేసినట్లు నటించాలి. మావాడి మీద కత్తి పెట్టడం నాకిష్టం లేదు. మా కుటుంబంలో ఎవ్వరూ నాకు ఏమి జరిగినా, మిమ్మల్ని ఏమీ అడగరు. దయచేసి నాకీ సాయం చేయండి'' రాందాసుకు మాట్లాడే అవకాశం లేకుండా రాఘవరావు నిష్క్రమించాడు.

రాందాసు ఆలోచనలో పడ్డాడు. 'కోడలిది, మామగారిదీ' ఒకే పంథా! కొడుకొక్కడే మరో మార్గంలో ప్రయాణిస్తుడు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

'గోడమీది భగవద్గీత చిత్రం' రామదాసుకు గీతోపదేశం చేస్తున్నట్లు వుంది. డాక్టరు కోర్సు పూర్తయ్యాక తీసుకున్న హిప్పోక్రటిక్ ఓత్, మెడికల్ ఎతిక్స్ గుర్తుకు వచ్చాయి. రాందాసు ఆలోచనలకు తెరపడినట్టయింది.

ఏదో నిర్ణయానికి వచ్చినట్లు రాందాసు కుర్చీ లోంచి లేచాడు. గది తలుపులు మూసి, క్లినిక్‌లోంచి బయటకు వచ్చి, సహాయకునికి సూచనలిచ్చి గబగబా తన కారువైపు సాగిపోయాడు.

*

## బ్రహ్మానందం పైకి కనిపించినంత కామెడీ కాదంట!



'ఖాన్‌తో పెట్టుకోవద్దు, శాల్తీలేచిపోతాయ్' అని ఆతను సీరియస్‌గానే అన్నా మనం నవ్వుకుంటాం. కాని నిజ జీవితంలో మాత్రం బ్రహ్మానందంతో పెట్టుకోవడానికి నిజంగానే చుట్టుప్రక్కల వాళ్ళు భయపడతారట. ఎనిమిది వందలకు పైగా చిత్రాల్లో నటించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న ఈ నటుడు షూటింగ్ సమయంలో మాత్రం చుట్టుప్రక్కల వాళ్ళని సతాయించడంలో సిద్ధహస్తుడట. షూటింగ్‌లో ప్రొడక్షన్ విభాగం నుండి ఈయనకి ప్రత్యేకమైన శ్రద్ధ అందవలసిందే. లేకుంటే అతని నోటి ధాటీ భరించవలసిందే. అందుకే నిర్మాతలు బ్రహ్మానందం బాగోగులు చూడటం కోసం ప్రత్యేకంగా ఓ ప్రొడక్షన్ మేనేజర్‌ని నియమిస్తారు. అయితే ఈ ప్రొడక్షన్ మేనేజర్‌కి తిట్లు భరించే సత్తా ఉండటం ముఖ్యమైన అర్హత. బ్రహ్మానందం దగ్గర ఇలా పనిచేసిన కొందరు అతనికి తిట్ల విషయంలో కూడా గిన్నీస్ వాళ్ళ గుర్తింపు లభించాలని వాపోతుంటారట.

# ఇంద్రధనుస్సు



**ఇంద్రగంటి శ్రీకాంతశర్మ**

# మనలోనే పెద్ద మడతుంది

సోనాయ్ నది.....

నదేమిటి? పెద్ద కాలువ అనవచ్చు.

ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దు రేఖ, ఆ నది మధ్య నుంచి పోతుంది.

నది మధ్య నుంచి రేఖేమిటనుకోవచ్చు. అది కేవలం ఊహారేఖ.

అంటే.. అటొక దేశం. ఇటొక దేశం.. ప్రజలొక్కళ్లే... భాష ఒక్కటే.

అటు బంగ్లాదేశ్ జెస్సార్ జిల్లాలో బడే నారాయణ పూర్ అనేదొక పల్లెటూరు. అక్కడ అఫ్రోజాబీబీ అని ఒక అమ్మాయి. వయస్సు పద్దెనిమిదేళ్లు. హజ్రక్ అలీ కూతురు. ఇటు బెంగాల్ రాష్ట్రం. ఇరవై నాలుగు పరగణాల జిల్లాలో తరాలీ అనే పల్లెటూరు. ఇలియాస్ గాజీ ఒక రైతు కూలీ. ఒక సుముహూర్తాన ఇలియాస్, మనిరుద్దీన్ అనే స్నేహితుణ్ని వెంటబెట్టుకొని, అఫ్రోజాబీబీ ఇంటికి వచ్చి, సంబంధం కుదుర్చుకుని, పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయానికి అఫ్రోజా తండ్రి చనిపోయాడు.

ఇలియాస్‌కి అప్పటికే పెళ్లయింది. ఇద్దరు బిడ్డల తండ్రి. అతడి మొదటి భార్య బతికే వుంది. అఫ్రోజా కాపరానికి వచ్చి, సవతితో పాటే తరాలీలో వుంటోంది. ఒకరోజు హఠాత్తుగా అఫ్రోజా ఇంటికి పోలీసులు వచ్చారు. ఇలియాస్ ఊళ్లో లేడు. సూటిగా ''నువ్వే దేశ ద్రోహివి?'' అని అడిగారు.

''అంటే?'' తెల్లబోయింది అఫ్రోజా.

''నీ పాస్ పోర్టు ఏది?''

''అంటే! అదేమిటి?''

''లేదు. సరే, ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నువ్వూ, మీ ఆయన స్వరూప్‌నగర్ పోలీసు స్టేషన్‌కి తప్పనిసరిగా వచ్చి కనిపిస్తూండాలి'' అంటూ హెచ్చరించి వెళ్లిపోయారు.

పాస్‌పోర్టులేమిటో, అక్రమంగా సరిహద్దు దాటి రావడమేమిటో ఆ తరాలీ పల్లెటూరు జనానికి అర్థం కాలేదు. బహు భార్యలుండడం కూడా వాళ్లకి తప్పు కాదు. సరిహద్దు అనేది దాటుకుంటూ ఇటూ అటూ వెళ్లడమూ, పశువుల సంతలూ, చిన్న చిన్న వ్యాపార లావాదేవీలు జరుపుకోవడమూ, బంధుత్వాలు నెరుపుకోవడమూ కూడా కొత్త కాదు. అందరూ అధికారులతో సహా ఎరిగిన నిత్య కృత్యమే. మరి- ఈ పోలీస్ స్టేషన్ వ్యవహారమేమిటి? ఏమంటే... తరాలీలో వుండే ఒక స్వచ్ఛంద సంస్థ సరిహద్దుకి అటూ ఇటూ పెళ్లిళ్ల పేరిట స్త్రీలను మోసగించి బొంబాయికీ, దేశంలోని ఇతర నగరాలకీ, ఆ మాటకొస్తే పశ్చిమ ఆసియా దేశాలకీ అమ్మేయడం ఎక్కువైందనీ, దీని మీద చర్య తీసుకోమనీ, ఒక సంఘటనగా అఫ్రోజా, ఇలియాస్ పెళ్లిని ఉదాహరిస్తూ ఫిర్యాదు చేసింది. అఫ్రోజా బీబీ 1998 జులై 25 నాటి నుంచి ఇలియాస్‌తో కాపరం చేస్తోంది. 'ఆగస్టు 30'కల్లా పోలీసులు ఆమె ఇంటి తలుపు తట్టారు. ఇలియాస్ అఫ్రోజాని అమ్మేయ్యడానికే పెళ్లి చేసుకున్నాడని అభియోగం. ఈ స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు అందుకొని ఇలియాస్ ఇంటి మీద, సరిహద్దు గ్రామాలలో అనుమానితుల మీదా పోలీసులు దాడి జరిపి ఆరా తీశారు. ఇలియాస్ కనిపించకుండా పోవడం, అతడి మిత్రులు, బంధువుల్లో కనీసం నలుగురు తమ భార్యల్లో ఒక్కొక్కరిని అమ్మేసి వుంటారని కూడా అభియోగం. ఇందుకు సాక్ష్యం 'బేనా' అనే వూళ్లో వుండే అబ్దుస్ సత్తార్ కథనం. అఫ్రోజా బీబీ అనాథ. ఆమె గతి ఏమయిందో తెలియదు.

ఇప్పటికి సరిగ్గా పదేళ్ల క్రితం అంటే 1998 సెప్టెంబర్ పదకొండో తేదీ నాటికి హిందు పత్రికలో ఒక బాక్స్ అయిటమ్‌గా ఈ వార్త ప్రచురితం అయి గుబులెత్తించింది. అప్పట్లో 'సరిహద్దుకి అటూ ఇటూ' అని ఒక నాటక రాద్దామని తీసి దాచాను. అప్పటి పని వత్తిళ్లతో నాటకం రాయలేకపోయాను.

స్త్రీ, పురుష ప్రేమకి ప్రాంతాలు, దేశాల సరిహద్దులు తుడిచిపెట్టుకుపోతాయని మహానుభావులంటూండడం విన్నాను. ప్రేమకే కాదు డబ్బు దాహం పట్టుకున్న వ్యాపార లావాదేవీలకు కూడా సరిహద్దులుండవు. డబ్బు రుచి మరిగిన ప్రతి వాడికీ అందునా కొత్తగా ఆ రుచి మరిగిన ప్రతి వాడికీ లాభనష్టాల, వ్యాపారపు సరుకుల ఎగుమతి, దిగుమతులు తప్ప మరేవీ పట్టవు.

అది నదిలో స్వేచ్ఛగా దొరికే ఇసుక కావచ్చు. కప్పలు కావచ్చు. నత్తలు కావచ్చు. బలిసినవో, బక్కచిక్కినవో జంతువులు, వాటి ఎముకలు కావచ్చు. పగిలిపోయిన గాజు పెంకులు, వీధిలో విసిరి పారేసే చిత్తు కాగితాలు కావచ్చు. రసాయనాలు కావచ్చు. కంప్యూటర్లు కావచ్చు. అమాయక జనం కిడ్నీలు కావచ్చు. మొఖానికి రంగు వేసి ఆడించే సినిమా బొమ్మ కావచ్చు. అచ్చంగా అందంగా కచ,కుచ,కక్ష ప్రదేశాలు చూపించే ఆడమనిషి కావచ్చు.

దానిని వ్యాపారపు సరుకుగా మనిషి గుర్తించ గలిగితే చాలు. అన్ని రోతలూ పటాపంచలైపోతాయి. కులం, మతం, ప్రాంతం, దేశం అనే అన్ని చిహ్నాలూ, తుడిచిపెట్టుకుపోతాయి. పెళ్లాం అని చెప్పు. మేం నోరెత్తితే ఒట్టు. ముక్కలుగా కొట్టి మాంసం అమ్మేయ్యి. మేం నోరెత్తితే ఒట్టు. శ్రీశ్రీ చెప్పినట్లు-వడ్డించిన విస్తరిగల వాళ్ల రక్షణకే న్యాయస్థానాలు, రక్షక భట వర్గాలు, చెరసాలలు, ఉరికొయ్యలు- ఇంకా మాట్లాడితే ''సరిహద్దు రేఖలు''

ఆడమనిషి జీవితమంటే, పురాణం చెప్పినట్లు. హార్మనీ పెట్టెలో ప్రేమలేఖలు కావు. తిలక్ ఒక చిన్నారి గురించి రాసినట్లు ''సంగీతం పెట్టె మీద సుతారంగా వేళ్లు కదలడమూ'' కాదు. ఏ మలుపు ఎప్పుడు తిరిగి కాశీ మజిలీ కథ అయిపోతుందో తెలియదు.

మనిషి మనిషితో మాట్లాడ్డం పోయింది. డబ్బు డబ్బుతో మాట్లాడుతుంది. మీరు కష్టపెట్టుకోకపోతే ఒక మాట. అది పెళ్లి కావచ్చు. అంత్యక్రియలు కావచ్చు. ఇచ్చే రేటు ఇచ్చేస్తే, దేనినెలాగైనా మలిచి అమ్మేయ్య గలిగే శక్తి ఈ భూగోళం మీద మనిషికి పట్టుబడింది.

''ఆర్థిక సంబంధాలనేవి సున్నితమైన సర్వ మానవ సంబంధాల్ని నిర్దాక్షిణ్యంగా తుంచేస్తాయని'' కార్ల్ మార్క్సు ఎంతటి ద్రష్టగా అన్నాడో కదా!

ద్రష్ట అయిన వాడు అలాగే సూత్రీకరిస్తాడు.

తెలుగు కవి కృష్ణశాస్త్రి ''అయ్యోమనిషే'' అంటూ రాసిన ఈ కవిత గుర్తుకొస్తోంది. మనస్సు చచ్చిపోయిన మనిషికి నా అశ్రద్ధాంజలి.

''తేలు కుడుతుంది. తోడేలు హింసిస్తుంది
తీతువెవ్వరినైనా తిడుతుంది.
లోన అంటుడు పురుగు ప్రాణం హరిస్తుంటె
పైన ఆటంబాంబు పడుతుంది.
ఎందుకీ గతి జగతికీలాగుపడుతుంది?
ఎందుకు స్మశానమై చెడుతుంది?
.............................................
.............................................
మనిషిలోనే పెద్ద మడతుంది.
మనిషజకే పెడబుద్ధిపడుతుంది!!

*

**కొసమెరుపు**

''పాలగుమ్మి పద్మరాజుగారు గొప్ప కథా రచయిత కదా. సినిమాల్లో ఎందుకు రాణించలేదంటారు?'' అని ఒక పద్మరాజు అభిమాని అడిగాడు.

దానికి ఆరుద్ర జవాబు.

''ఆయన 'రాజు' కదా! ఎలా 'రాణిస్తాడు?''